





# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

గురువారం
28 మే 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## హైదరాబాద్‌లో జలమండలి షాక్..

మంచినీటిని వృథా చేశారంటూ 10 వేల జరిమానా

తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించినందుకు చర్య

బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో ఘటన

తాగునీటితో దుకాణ ప్రాంగణాన్ని కడిగిన వ్యక్తికి జరిమానా



## హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి



## అరణ్య ఫామ్‌హౌస్‌కు బండి భగీరథ్‌ను తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్



## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

పంటల కొనుగోలు లేక దీనావస్థ

వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి

బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి

పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు,

(మిగతా 2వ పేజీలో)

## మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి

చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి

ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి



హైదరాబాద్ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో

(మిగతా 2వ పేజీలో)

## జూన్ 12న బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మెనూ

మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా

ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్డ్ వెజిటేబుల్ కుర్మా



## భారత్, అమెరికా 'ఖనిజ' బంధం

అరుదైన, కీలకమైన ఖనిజాల సరఫరాలో పరస్పర సహకారం

చరిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరుదేశాలు

న్యూఢిల్లీ: అరుదైన, కీలకమైన ఖనిజాల సరఫరాలో పరస్పర సహకారమే లక్ష్యంగా భారత్, అమెరికాలు చరిత్రాత్మక ఒప్పందం

(మిగతా 2వ పేజీలో)



## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ..

కిందపడిన ఫిరోజ్‌ఖాన్

ప్రోటోకాల్ విషయంలో ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ మధ్య ఘర్షణ

అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం

అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీహెచ్‌ను నెట్టివేసే యత్నం

ఇది తమ ఫ్యామిలీ విషయమన్న ఫిరోజ్ ఖాన్

కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ముందే

# అకాలవర్షంతో అన్నదాత ఆవేదన

కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దైన ధాన్యం

లారీల కొరతతో యార్డుల్లోనే పేరుకుపోయిన వడ్లు

గన్నీ సంచులు లేక రైతుల నిరీక్షణ

పలు జిల్లాల్లో మొక్కజొన్నకు తీవ్ర నష్టం

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని ప్రభుత్వ హామీ

కొనుగోళ్ల వేగం పెంచాలని అధికారులకు సీఎం ఆదేశాలు



హైదరాబాద్ :రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం, మొక్కజొన్న వర్షానికి తడిసిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గన్నీ సంచుల కొరత, లారీల ఆలస్యం, కొనుగోళ్లలో జాప్యం కారణంగా ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. పలు జిల్లాల్లో ధాన్యం కుప్పలు నీటిలో కొట్టుకుపోగా, కొన్నిచోట్ల మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. సిద్దిపేట జిల్లా నర్సాపూర్‌కు చెందిన రైతు దంపతులు కరోళ్ల కనకయ్య, మంగవ్వ 10 ట్రాక్టర్ల ధాన్యాన్ని పదిహేను రోజుల క్రితమే మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. తేమ శాతం పరీక్షలు పూర్తయినా గన్నీ బ్యాగులు

(మిగతా 2వ పేజీలో)



## అమెరికాలో తెలుగు యువకుడి హఠాన్మరణం

మృతుడిని ఏలూరుకు చెందిన నితిన్ రెడ్డి గోపిరెడ్డిగా గుర్తింపు

వచ్చే నెలలో వివాహం జరగాల్సి ఉండగా విషాద ఘటన

ఉద్యోగం కోల్పోవడంతో తీవ్ర ఒత్తిడికి గురైనట్లు సమాచారం

## యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలి.! గుండగోని మధు గౌడ్



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో తెలంగాణ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానంతో తీరుతో లక్షలాది విద్యార్థులు, వందలాది మంది కళాశాలల యాజమాన్యాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు అని బీసీ సంఘం రాష్ట్ర యువజన విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి గుండగోని మధు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం గానీ, ప్రస్తుతమున్న ప్రభుత్వం కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7,500 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందలాది కాలేజీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి అన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడ్డాయి. 90% కాలేజీ యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు సకాలంలో ఇవ్వలేని కారణంగా కాలేజీల సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరగడంతో ఆయా కాలేజీల నిర్వహణ కూడా భారంగా మారింది. సరైన వేతనాలు చెల్లించలేకపోవడంతో.. విద్యా ప్రమాణాలు కూడాదెబ్బతింటున్నాయిన్నారు. ఇది రాష్ట్ర విద్యావ్యవస్థకే పెనుసవాల్ గా మారే పరిస్థితులను సృష్టిస్తోంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో తమ కాలేజీలు నడవాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని విద్యార్థులే మోయాలని, లేనిపక్షంలో సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంవల్ల సామాన్య, బడుగు బలహీనవర్గాల విద్యార్థులు అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలి ఉన్నారు గుండగోని మధు గౌడ్

## మాల్ టౌన్ -- గోడుకొండ్ల గ్రామాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలి-- సందుపట్ల లక్ష్మణ్ సాగర్



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

రంగారెడ్డి--నల్గొండ బార్డర్‌లో ఉండి, భవిష్యత్తులో మంచి కనెక్టివిటీ, అభివృద్ధి అవకాశాలు కలిగి ఉండి. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ పరిధిలో 56 గ్రామాలు ఉన్నాయి. యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం వంటి మండలాలు ఇప్పటికే అభివృద్ధి జోన్‌లుగా ప్రకటించబడ్డాయి.మాల్ టౌన్ -- గోడుకొండ్ల గ్రామాన్ని చేర్చితేయువతకు ఐటీ, స్కిల్ యూనివర్సిటీ, పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి రియల్ ఎస్టేట్ మరియు వ్యాపార అభివృద్ధి వేగంగా జరుగుతుందిరోడ్లు, నీరు, విద్యుత్, ఆస్పత్రులు స్కూల్స్, కళాశాలలు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయిహైదరాబాద్‌కు సమీపంగా ఉండటం వల్ల పెట్టుబడులు పెరుగుతాయి.భవిష్యత్తులో మన మాల్ టౌన్ – గోడుకొండ్ల ప్రాంతం మరో హైటెక్ కారిడార్‌గా మారే అవకాశం ఉంటుంది.మన గ్రామ ప్రజల తరఫున గ్రామ పంచాయతీ తీర్మానం సంతకాల సేకరణ తో ఒక వినతి పత్రం సమర్పించాలని తెలిపారు సందుపట్ల లక్ష్మణ్ సాగర్

## హిందువుల మనో భావాలను గౌరవిద్దాం.. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి..

### - బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను కుర్బానీగా ఇవ్వకూడదు- మహమ్మద్ రహీం షరీఫ్ సంచలన వాక్యాలు



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు మహమ్మద్ రహీం షరీఫ్ మాట్లాడుతూ గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో గోవును కోట్లాదిమంది హిందువులు పవిత్రంగా భావిస్తారు. మతసామరస్యాన్ని కాపాడేందుకు హిందువుల మనోభావాలను గౌరవిస్తూ "బక్రీద్" పండుగ సందర్భంగా గోవులను కుర్బానిగా ఇవ్వకూడదని ముస్లిం మత పెద్దలు తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని అన్నారు. దేశంలో శాంతి వెల్లివిరియాలంటే అన్ని మతాల ప్రజలు ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవాలి. ఈ మేరకు ముస్లిం పెద్దల ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గో సంరక్షణ కేవలం ఒక మతానికి సంబంధించిన అంశం కాదని భారతీయ సంస్కృతి, వ్యవసాయ రంగానికి గోవు వెన్నెముక అని అన్నారు. అందుకే గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని చట్టపరమైన రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు మునుగోడు నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండి రైమ్ షరీఫ్

## ఎండలు, అకాల వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం అల్లకల్లోలం.. లేటెస్ట్ వెదర్ రిపోర్ట్ ఇదే

ఉత్తర తమిళనాడు ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మరోవైపు పలు జిల్లాల్లో 45 నుంచి 46 డిగ్రీల తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఓ వైపు అకాల వర్షాలు, మరోవైపు మాడుపగిలే ఎండలు జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి..అమరావతి, మే 28: రాష్ట్రంలో ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, మరోవైపు పలు జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపింది. దీని ప్రభావంతో గురువారం బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఇక రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరుగుతోంది. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో అత్యధికంగా 41.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంలో 41.6 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు వడదెబ్బ ప్రభావం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం వడదెబ్బకు గురై శ్రీకాకుళం జిల్లాలో పలాసపురానికి చెందిన సింహాచలం పాణిగ్రహి (68), రంగనాథపురానికి చెందిన నడిపూడి కృష్ణారావు (36) మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నా వేళల్లో బయటకు రావద్దని, తగినంత నీరు తీసుకోవాలని,

# కలిసి పనిచేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

రూబియోను కలవడం ఆనందంగా ఉందంటూ మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. భారత్‌అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నిరంతర పురోగతి, ప్రాంతీయ, ప్రపంచ శాంతి భద్రతకు సంబంధించిన అంశాలపై తాము చర్చించామని వెల్లడించారు. రెండు దేశాలు నిరంతరం సన్నిహితంగా కలిసి పనిచేస్తూనే ఉంటాయన్నారు. వాణిజ్య, రక్షణ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి, కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై సహకారాన్ని వేగవంతం చేయడానికి మోదీ, రూబియో అంగీకరించారని అమెరికా విదేశాంగ శాఖ తెలియజేసింది. భారత్, అమెరికాలు అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతి గురించి రూబియో ప్రధాని మోదీకి వివరించారని భారత ప్రభుత్వవర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారని పేర్కొన్నాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సంఘర్షణలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మరోసారి పిలుపునిచ్చారని స్పష్టంచేశాయి. మోదీ, రూబియో మధ్య ఫలవంతమైన సమావేశం జరిగిందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. భారత్ తమకు అత్యంత ము ఖ్యమైన భాగస్వామి అని రూబియో తేల్చిచెప్పారు. మోదీతో భేటీ అనంతరం అమెరికా ఎంబసీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు రాబోయే రో జుల్లో ఇరుపక్షాలు కొన్ని కీలక ప్రకటనలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయని తెలిపారు. ఇండోపసిఫిక్ విషయంలో వాషింగ్టన్ విధానానికి భారతదేశం 'ఒక మూలస్తంభం'అని అభివర్ణించారు. త్వరలో అమెరికా పర్యటించాలని, వైట్‌హౌస్‌ను సందర్శించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున మార్కో రూబియో ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. ఈ విషయం అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలియజేశారు. మోదీతో భేటీ సందర్భంగా ఈ ఆహ్వానం అందించారని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్‌కు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయాలని రూబియోను మోదీ కోరారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది. ట్రంప్‌తో సంభాషణ కోసం ఎదురుచూస్తున్నానని చెప్పారని వెల్లడించింది. కోల్‌కతాలో మదర్ హౌస్‌ను సందర్శించిన రూబియో నాలుగు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన మార్కో రూబియో తొలుత కోల్‌కతాలో అడుగుపెట్టారు. సెర్గియో గోర్ ఆయనకు



స్వాగతం పలికారు. అమెరికా విదేశాంగ మంత్రి ఒకరు కోల్‌కతాలో పర్యటించడం 14 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. చివరిసారిగా 2012 మే నెలలో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ ఇక్కడ పర్యటించారు. మార్కో రూబియో కోల్‌కతాలో ప్రఖ్యాత మదర్ హౌస్‌ను సందర్శించారు. ఇది భారత రత్న మదర్ థెరిసా స్థాపించిన 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' ప్రదాన కార్యాలయం. మదర్ హౌస్ అధికారులతో రూబియో మాట్లాడారు. అనంతరం నిర్మల శిశు భవన్ కూడా సందర్శించారు. ఇది మిషనరీస్ ఆఫ్ చారిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పిల్లల సంరక్షణ కేంద్రం. రూబియో ఈ నెల 26వ తేదీ వరకు భారత్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 'క్వాడ్'దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతారు. ఢిల్లీతోపాటు ఆగ్రా, జైపూర్‌లో పర్యటిస్తారు.

## వైద్య రంగంలో సరికొత్త విప్లవం 'సంజీవని'..

# ఇంటివద్దకే ఆధునిక వైద్యం.!

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు సీఎం వెల్లడించారు.ఈ సభలో సీఎం చంద్రబాబు ఆరోగ్యం ప్రాధాన్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. మనిషికి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే వృథా అని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే అందరికన్నా నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. ఏదో బతికి ఉన్నాం కదా అని మంచంపై కాలం వెళ్లదీయడం కాకుండా, ప్రతి ఒక్కరూ హెల్తీగా బతకడమే ముఖ్యమన్నారు. భవిష్యత్తులో మన పిల్లలే మన సంపద అని, ఆరోగ్యవంతమైన ప్రజలు ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు సైతం అత్యుత్తమ కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ సంజీవని ప్రాజెక్టు మెయిన్ ఎయిమ్ అని స్పష్టం చేశారు. సమాజం బాగుండాలంటే ప్రజలు ఫిట్‌గా ఉండాలని, అందుకోసమే ప్రిడిక్టివ్ (ముందుగా ఊహించడం), ప్రివెంటివ్ (నివారించడం), క్యూరేటివ్ (నయం చేయడం) అనే మూడు అంచెల విధానంలో సంజీవని ప్రాజెక్టును ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. వ్యాధులు వచ్చాక బాధపడటం కంటే, అవి రాకముందే గుర్తించి అలర్ట్ చేయడమే నిజమైన డెవలప్‌మెంట్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ల్యాబ్‌లకు వెళ్లే అవసరం లేకుండా ఏకంగా 42 రకాల వైద్య పరీక్షలను నేరుగా ఇంటి వద్దే నిర్వహించి నిమిషాల్లో రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. డాక్టర్ అప్పాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా టాప్ డాక్టర్స్ వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల మానిటరింగ్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ ఇందులో ఉన్నాయి. ఈ సంజీవని ప్రాజెక్టు అనేది కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇదొక అత్యుత్తమ 'డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్' అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రజలను అనారోగ్యం నుంచి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చే 'సిటిజన్ వెల్‌నెస్ మిషన్' ఇదన్నారు. టెక్నాలజీని వాడుకోవడంలో ఎప్పుడూ ముందే ఉండే చంద్రబాబు సర్కార్.. త్వరలోనే ఈ ప్రాజెక్టులో భాగంగా 'ఏఐ డాక్టర్' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా కూడా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించబోతున్నట్లు క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. గత ఏడాది జూలైలో కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును పైలట్‌గా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రోల్ అవుట్ చేశారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రజారోగ్య వ్యవస్థను సిద్ధం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్‌తో రాబోయే ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం) నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును ఫుల్ స్కేల్‌లో లాంచ్ చేయాలని నిర్ణయించినట్లు సీఎం చంద్రబాబు అనౌన్స్ చేశారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై కూడా సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పందించారు. ఈ సంవత్సరం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ రిపోర్ట్స్ చెప్తున్నాయని, అయితే ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందని ప్రజలకు భరోసా ఇచ్చారు.



## వేద పాఠశాలకు భూమిపూజ

యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులన్నింటికీ ఒకేచోట పెద్దగుట్టపై శిలాఫలకం వేశారు. అందులో ప్రధానమైనది వేద పాఠశాల. వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి వేద ఆశీర్వచనం అనంతరం అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేశారు. సీఎంతోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు భూమిపూజ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కొండపైకి కాన్వాయ్‌లో చేరుకున్నారు. ప్రధానాలయం తూర్పు రాజగోపురం నుంచి, త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ అర్చక బృందం, వేదపండితులు పూర్ణకుంభంతో సీఎంకు స్వాగతం పలకగా మొహోదట ఆంజనేయస్వామిని దర్శించుకొని ఆ తర్వాత ప్రధానాలయంలోని స్వయంభూలను, ఉత్సవ మూర్తులను దర్శించుకుని రేవంత్ పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రధానాలయం ముఖమండపంలో సీఎంకు వేదాశీర్వచనం చేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ఆలయ ఈవో భవాని శంకర్ స్వామివారి జ్ఞాపికను సీఎంకు అందజేశారు. వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సీఎం పశ్చిమ రాజగోపురం గుండా ఆలయం నుంచి బయటకు వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం చోటుచేసుకుంది. సీఎం, మంత్రులు ఉన్న హెలికాప్టర్ ప్రొటోకాల్ ప్రకారం నిర్దేశిత యాదగిరిగుట్ట గోశాల స్థలంలో ల్యాండ్ కావాల్సి ఉండగా దానికి బదులు పెద్దగుట్టపై దిగింది. అక్కడ స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, భద్రతా అధికారులు ఎవరూ లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు 10 నిమిషాలపాటు హెలికాప్టర్‌లోనే వేచి చూశారు.

# 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించనుంది. మిగిలిన 500 ఇళ్లను గతంలో వివిధ గృహనిర్మాణ పథకాల కింద మంజూరై వివిధ కారణాలతో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి కేటాయించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి గృహనిర్మాణ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

### అసంపూర్తి ఇళ్లకు ఇందిరమ్మ అండ...

ఉమ్మడి ఏపీలో దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, గత ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులతోపాటు ఇంకా ఎవరైనా లబ్ధిదారుల ఇళ్లు అసంపూర్తిగా మిగిలి ఉంటే ఈ పథకం కింద ప్రయోజనం కల్పించనున్నారు. పునాదులు పూర్తై గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ. 3 లక్షలు, గోడలు పూర్తై శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ. 2 లక్షల చొప్పున సహాయం చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. మూడో, నాలుగో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సైతం అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అనర్హులని తొలి విడతలో ప్రభుత్వం చెప్పింది. నాడు సిమెంట్, స్టీల్, నగదు రూపంలో రూ. 25 వేలు తీసుకున్న వారిని రెండోవిడత ఇందిరమ్మ పథకం కింద అర్హులుగా పరిగణించాలని తాజాగా మంత్రివర్గం నిర్ణయించింది. ఆ రూ. 25 వేలను మినహాయించుకొని రూ. 5 లక్షల్లో మిగిలిన మొత్తాన్ని వారికి అందజేయ నుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 14,800 పూరి గూడిసెలున్నట్లు వివిధ దఫాలుగా చేసిన సర్వేల్లో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రెండో విడత ఇందిరమ్మ పథకం కింద ఆయా కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని నిర్ణయించింది. ఇందిరమ్మ పథకం కింద కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో 67 లక్షల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 18,500 మందికి మాత్రమే సొంత స్థలాలు ఉన్నాయి. వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షలను నెలాఖరులోగా ప్రభుత్వం మంజూరు చేయనుంది. మిగిలిన దరఖాస్తుదారుల్లో సొంత స్థలాలు లేని 33.5 లక్షల మంది అర్హులుంటారని ప్రభుత్వం అంచనా వేసింది. క్యూర్ ఏరియాలోని గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న 24 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గాన్ని యూనిట్‌గా పరిగణించి అల్పాదాయ వర్గాలు (ఎల్ఐజీ), మధ్యతరగతి వర్గాల (ఎంఐజీ)కు లక్ష ఇళ్లను నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం తీర్మానించింది. ఎల్ఐజీ ఇళ్ల పథకం కింద 400420 చదరపు గజాల విస్తీర్ణంతో ఫ్లాట్ల నిర్మాణానికి రూ. 5 లక్షలతోపాటు అన్‌డివైడ్ ల్యాండ్ షేర్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల అదనపు వ్యయాన్ని లబ్ధిదారులు భరించాల్సి రానుంది. నిరుపేదలు జీవనోపాధి కోసం ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఎల్ఐజీ ఇళ్లను నిర్మించనున్నారు. మురికివాడల్లో నివసిస్తే అక్కడే కట్టిస్తామని పొంగులేటి తెలిపారు. వారు ఉండే ప్రాంతంలో ప్రభుత్వ స్థలం లేకుంటే హౌసింగ్ బోర్డు, ఇతర ప్రభుత్వ శాఖల నివాసయోగ్యమైన భూముల్లో వారి కోసం ఇళ్లను నిర్మించనున్నారు.

# ఘనంగా ముగిసిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

### హాజరైన మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ వసంత



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 27

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని రామాజీపేట గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం తో ఘనంగా ముగిశాయి. చివరి రోజున మల్లన్న నాగవెల్లి, అగ్ని గుండాల ప్రవేశం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శివసత్తులు, భక్తులు అగ్ని గుండాల గుండా దాటి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నాగవెల్లి పట్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంనకు హాజరైనా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి, జడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, గ్రామ మాజీ సర్పంచ్ వాసరి రవి యాదవ్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కుల మల్లారెడ్డి యాదవ్, వేల్పుల చిన్న నర్సయ్య, సభ్యులు గోనె విష్ణు, మర్రి తిరుపతి, గంగారెడ్డి, బుచన్న, కమలాకర్, రాజు, వేణు, రాజం, లింగన్న, మల్లేశం, మహేష్, నరేందర్, సంఘ మోహన్, వివిధ గ్రామాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లీపూర్ లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఘన సన్మానం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 27

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ఏర్పాటు అయిన తర్వాత పాలకవర్గం ఆహ్వానం మేరకు మొదటిసారిగా గ్రామ పంచాయతీ విచ్చేసిన ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారిని పూల బోకే, సాల్వాలతో ఘనంగా సత్కరించిన గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి-వెంకటేష్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు.

### ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన ఇంద్రాల ఎలీషా లింగన్న నూతన ఇంద్రమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.

### బీరయ్య పట్నాలకు హాజరైన ఎమ్మెల్యే

మండలం అల్లిపూర్ గ్రామంలో బీరయ్య పట్నాలకు హాజరైనా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమం లో రాయికల్ మండలం, అల్లిపూర్ గ్రామ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడులో పాల్గొన్న సికింద్రాబాద్ నాయకులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 27: తెలుగుదేశం పార్టీ తెలుగువారి ఇంటి పండుగగా నిర్వహించే మహానాడు ఈ నెల 27, 28 తేదీలలో వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్, టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధికార ప్రతినిధి కాసుల సుదర్శన్ రెడ్డి, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు కాత విజయ్ కుమార్, అడ్ హక్ మెంబర్ భాను ప్రకాష్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు తడక వినోద్ కుమార్, నగర్ యువత అధ్యక్షులు శ్యామ్ కుమార్, సీతాఫల్ మండి సీనియర్ నాయకులు విక్రమ్ ముదిరాజ్, రామారావు, ప్రసాద్ రావు, బాలకృష్ణ, రాజు, అనిల్ తదితరులు వర్చువల్ మహానాడులో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై మహానాడులో చర్చలు జరిగాయని నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు సభ్యునిగా మోతే శోభన్ రెడ్డికి అభినందనలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 27: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు సభ్యునిగా మోతే శోభన్ రెడ్డి నియమితులైన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వీరోచితంగా పోరాటం చేసిన నిబద్ధత కలిగిన ఉద్యమకారుడికి ఈ బాధ్యత రావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పోరాట యోధుడు సంక్షేమ బోర్డులో ఉండటం ద్వారా ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి వెళ్లి, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ సర్వస్వాన్ని అర్పించిన ఉద్యమకారులను గుర్తించి, వారికి ప్రభుత్వం ద్వారా తగిన గుర్తింపు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులకు కూడా రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు టేకులపల్లి రాంచంచందర్, కొరపాక అంజి మాదిగ, బొడ్డు శివ, అద్వై గజ్వేల్లి శ్రీనివాస్, నడిగంటి బాలరాజ్, పాకాల రవి, దత్రపు దేవకుమార్, ఏల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ మల్లికార్జున మోటార్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :మే 27 :- మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మల్లికార్జున మోటార్స్ షోరూమ్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన వాహనాలను సరసమైన ధరలకు అందించాలని సూచించారు. అలాగే ప్రతి వాహనం కొనుగోలు చేసే వారికి ఉచిత హెల్మెట్ అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.వ్యాపార రంగంలో ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని, యువత భద్రత కోసం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దిండు భూపేష్ గౌడ్, శీను నాయక్, అర్కల భూపాల్ రెడ్డి, దీప్లాల్ చౌహన్, సిద్దాల లావణ్య బీరప్ప, కామేష్ రెడ్డి, మదారి రమేష్, సిద్దాల అంజయ్య, లక్ష్మణ్ ముదిరాజ్, అనిల్ యాదవ్, సిద్దాల బీరప్ప, రాజ్ కుమార్ , సునీత బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



### మానవత్వాన్ని చాటిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :మే 27 :- మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రశాంతి హిల్స్ డివిజన్ పరిధిలోని నంది హిల్స్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి తిరిగి వస్తుండగా, రెండు కాళ్లు లేని ఓ యువతి కుటుంబ సభ్యులు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని కలిసి "అమ్మా... మా పాపను ఒక్కసారి పలకరించండి, మీతో ఒక ఫోటో దిగాలని కోరుకుంటోంది"లి అని వినతిచేశారు వెంటనే స్పందించిన సబితా ఇంద్రారెడ్డి ఆ యువతి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే ఆత్మీయతతో ఆ అమ్మాయి కళ్లల్లో ఆనందం రెట్టింపైంది. ఈ సందర్భంగా ఆ యువతి "అమ్మా... నాకు ఒక ట్రై సైకిల్ ఇప్పించగలరా" అని అభ్యర్థించగా, వెంటనే స్పందించిన సబితా ఇంద్రారెడ్డి ఈరోజే ఆ అమ్మాయికి ట్రై సైకిల్ అందించాలి" అని ఆదేశాలు జారీ చేశారు అప్పటికప్పుడే ఆగమేఘాల మీద ట్రై సైకిల్‌ను ఆ యువతి ఇంటికి చేరవేయడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆశ్చర్యంతో పాటు సంతోషంతో నిండిన ఆ యువతి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# జగిత్యాలలో వివాహిత అవయవ దానం

### - పలువురి జీవితాల్లో వెలుగులు ప్రసరించి మానవత్వం చాటుకున్న సుప్రియ..



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 27


జగిత్యాల పట్టణం లోని హనుమాన్ వాడ కు చెందిన అక్కపెల్లి ప్రవీణ్ సతీమణి సుప్రియ (25) అనే మహిళ స్కూటీ బండి నడిపించడం నేర్చుకునే క్రమంలో బండి పై నుండి ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి తీసుకెళ్లాలని సూచించారు. గత 3 రోజులుగా యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కానీ ఆమె ఆరోగ్యం కుదుటపడక పోగా మరింత విషమంగా మారి బ్రెయిన్ డెడ్ (జీవన్మృతురాలు) అయిందని తాను తిరిగి కోల్కోవడం కష్టతరమని డాక్టర్లు నిర్ధారణ చేశారు. గత మూడు రోజులుగా మృత్యువు తో పోరాడిన సుప్రియ గతరాత్రి తుది శ్వాస విడిచారు. దీనితో ఆమె భర్త అక్కపెల్లి ప్రవీణ్, కుటుంబ సభ్యులు మహిళ అవయవాలను స్వచందంగా దానం చేయడానికి ముందుకు రావడంతో, ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్ ప్రతినిధులతో మాట్లాడి అవయవ దానం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.దీనితో సుప్రియ శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, కళ్ళు, మూత్రపిండాలు, కాలేయం ను జీవన్ దాన్ ప్రతినిధులు సేకరించి అనంతరం వారు మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఈ అవయవాలతో చాలా మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపజేసిందని సుప్రియను కొనియాడారు., ఆమెకు భర్త ఇద్దరు కూతుర్లు తేజశ్రీ (6), వైష్ణక (3) ఉన్నారు అతి చిన్న వయసులో ఇద్దరు పిల్లలని వీడి అనంత లోకాలకు వెళ్లిన సుప్రియ ఉదంతం తెలిసిన ప్రతి ఒక్కరు ఒక వైపు కొనియాడుతుంటే, మరోవైపు కుటుంబ సభ్యులు, ప్రాంత ప్రజలు చిన్న పిల్లలను చూసి కన్నీటి పర్యంతమౌతున్నారు. ఇక మరికొందరు పట్టణ ప్రముఖులు సుప్రియ చిరంజీవిగా మిగిలిపోయిందని ప్రశంసిస్తున్నారు.

# పసిడి ప్రియులకు ఊరట.. మీ ఊరిలో తులం ధర ఎంతుందో ఇక్కడ తెలుసుకోండి

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో మార్పులు కొనసాగుతున్నాయి. మే 28న హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సహా తెలుగు రాష్ట్రాల్లో 24 క్యారెట్ల బంగారం తులం రూ.1.58 లక్షల వద్ద కొనసాగుతోంది. వెండి ధరలు స్వల్పంగా తగ్గి కిలో రూ.2.89 లక్షల మధ్య నమోదయ్యాయి..హైదరాబాద్, మే 28: అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో అటు క్రూడ్ ఆయిల్.. ఇటు బంగారం ధరలు పోటాపోటీగా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ఈ క్రమంలో బంగారం కొనాలనుకునే వారికి నేటి పసిడి ధరలు కాస్త ఊరటనిచ్చాయి. బంగారంతో పాటు వెండికీ ప్రస్తుతం మార్కెట్లో మంచి గిరాకీ ఉండటంతో ధరలు ఎప్పుడెప్పుడు దిగొస్తాయా అని జనాలు ఎదురు చూస్తున్నారు. తేడాది గోల్డ్ రేటు ఏకంగా 70 శాతం వరకు పుంజుకుంది. ఇక వెండి సంగతి సరేసరి. సిల్వర్ రేటు గతేడాది రికార్డు స్థాయిలో 150 శాతం వరకు పెరిగింది. బుధవారం (మే 27) కూడా బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. ఇక ఇవాళ (మే 28న) తెలుగు రాష్ట్రాల్లో ఏయే నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం..నేటి బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. 24 క్యారెట్ల గోల్డ్ గ్రాము ధర రూ.15,282, 22 క్యారెట్ల గోల్డ్ గ్రాము ధర రూ.14,509, ఇక 18 క్యారెట్ల గోల్డ్ గ్రాము ధర రూ.11,871 వద్ద పలుకుతుంది. తులం ప్రకారం చూస్తే 24




క్యారెట్ల గోల్డ్ తులం రూ. 1,58,280 వద్ద కొనసాగుతుంది. 22 క్యారెట్ల గోల్డ్ తులం రూ.1,45,090, 18 క్యారెట్ల గోల్డ్ తులం రూ.1,18,710 వద్ద కొనసాగుతున్నాయి. తెలంగాణ, ఏపీలోని ప్రధాన నగరాల్లో ఇవాళ్టి బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..మే 28 బంగారం ధరలు ఇవే..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.15,828, 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.14,509, 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.11,871విజయవాడలో 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.15,828, 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.14,509, 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.11,871విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.15,828, 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.14,509, 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.11,871 గా ఉంది. అమరావతి, గుంటూర్, నెల్లూరు, తిరుపతి, అనంతపూర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి అన్ని ప్రధాన నగరాల్లో దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి.మే 28న తెలుగు రాష్ట్రాల్లో వెండి ధరలు ఇలా..ఇక వెండి ధరలు చూస్తే.. వెండి గ్రాము రూ.284.90 వద్ద ఉంది. కిలో ధర రూ.2,84,900 వద్ద కొనసాగుతుంది. తులం (10 గ్రాములు) రూ.2,849 వద్ద ఉంది. నిన్నటితో పోల్చితే కిలో వెండి ధర నేటికి రూ.వంద తగ్గింది.



# చర్మమా.

చలికాలం చర్మానికి గడ్డుకాలమే. వాతావరణంలో తేమశాతం తగ్గిపోవడంతో రకరకాల సమస్యలు వస్తాయి. అయితే, కొన్ని అపోహల వల్ల చాలామంది చర్మ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. వాటిని దూరం చేసుకుంటే చలికాలాన్ని గట్టెక్కినట్టే.

**ఈ కాలంలో సన్‌స్క్రీన్ లోషన్ అవసరం లేదు.**

పొరపాటు! అతినీలలోహిత కిరణాలు ఏడాది పొడవునా మన చర్మం మీద ప్రభావం చూపిస్తాయి. ఈ సీజన్‌లో ఆ తీవ్రత మరింత ఎక్కువ. కాబట్టి సున్నితమైన చర్మం ఉన్నవారు, బయటికి వెళ్లే టప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడం తప్పనిసరి!

**మన చర్మానికి వేడి నీటి స్నానం ఎంతో మేలు చేస్తుంది.**

తప్పు! వేడివేడి నీళ్లు చర్మం మీదున్న ఆ కాస్త తేమనూ హరిస్తాయి. కాబట్టి చలి కాలంలో, మరీ ముఖ్యంగా పొడిబారిపోయే చర్మం ఉన్నవారు గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే మంచిది. ఆపై మాయిశ్చరైజర్ రాయడం వల్ల తేమ నిలిచి ఉంటుంది.

**తగినన్ని నీళ్లు తాగితే చర్మం పొడిబారదు.**

కాదు! శీతకాలంలో దాహం వేయక పోయినా, తగినన్ని నీళ్లు తాగడం మంచిదే. కానీ నేరుగా చర్మాన్ని తాకే పొడిగాలులు, హీటర్ల నుంచి వచ్చే వేడి.. చర్మాన్ని పొడిబారుస్తాయి. ఈ సమయంలో మంచి మాయిశ్చరైజర్ చాలా అవసరం.

**పెట్రోలియం జెల్లీని మించిన మాయిశ్చరైజర్ లేదు.**

ప్చ్! చవకగా, తేలికగా దొరికే పెట్రోలియం జెల్లీ వల్ల ఉపయోగం లేకపోలేదు. అది చర్మంలోని తేమ ఆవిరై పోకుండా అడ్డుకుంటుంది. అంతకుమించి చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉండేందుకు.. అదనంగా తేమ దక్కేందుకు షియా బటర్ లాంటి పదార్థాలతో కూడిన మాయిశ్చరైజర్ వాడాలి.

**పెదాలు పగిలినప్పుడే లిప్ బామ్ వాడాలి.**

లేదు! చలి ఎక్కువగా ఉన్న సమయం నుంచే లిప్ బామ్ రాయడం మొదలుపెడితే, పెదాలు పగిలేంత సమస్య

# అరబిక్ కాంతులు

ఇంటీరియర్ డిజైనింగ్ కొత్తపుంతలు తొక్కుతున్నది. రాజస్థానీ, ఎలిజబెత్ ఎరా, సంప్రదాయ.. ఇలా, అభిరుచిని బట్టి నచ్చిన గృహాలంకరణ పద్ధతిని ఎంచుకుంటున్నారు. తాజాగా, అరబ్ శైలి పట్ల చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అందులోనూ దీపకాంతుల విషయంలో.. ఏరికోరి ఎంచుకుంటున్నారు. అరేబియన్ అలంకరణలో ఆర్భాటం ఉండదు. కానీ, తెలియని హుందాతనం తొంగిచూస్తుంది. కళాత్మకత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దీంతో ఇంటీరియర్ డిజైనర్లు దుబాయ్ నుంచి కూడా దిగుమతి చేసుకుంటున్నారు. సీలింగ్ ల్యాంప్‌లు, షాండిలియర్స్, టేబుల్ ల్యాంప్స్.. దేని అందం దానిదే. యాంటిక్ లాంతర్ల కోసమైతే ఎంతైనా వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు.





# కొబ్బరితో కలిగే ఆరోగ్య

పచ్చి కొబ్బరి..! కొందరు ఈ పచ్చికొబ్బరిని చాలా ఇష్టంగా తింటారు. అల్పాహారాల్లో వేసుకునే చట్నీగా, తీపి వంటకంగా పచ్చికొబ్బరిని వినియోగిస్తుంటారు. అయితే కొంతమంది మాత్రం దగ్గు వస్తుందని, బరువు పెరుగుతామని, ఒంట్లో చెడు కొవ్వు పెరుగుతుందని భయంతో ఈ పచ్చి కొబ్బరిని దూరం పెడుతారు. మరె నిజంగానే పచ్చికొబ్బరితో ఆరోగ్య సమస్యలు వస్తాయా..? శరీరంలో చెడు కొవ్వు పేరుకపోతుందా..? అంటే.. ఆరోగ్య నిపుణులు కాదని చెబుతున్నారు. పైగా పచ్చి కొబ్బరిని తరచూ తగిన మోతాదులో తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయంటున్నారు. పచ్చి కొబ్బరి యాంటీ బయోటిక్‌గా పని చేస్తుందని చెబుతున్నారు. కాబట్టి పచ్చి కొబ్బరితో కలిగే

**రోగ నిరోధక శక్తి వృద్ధి**

పచ్చి కొబ్బరిని తరచూ తింటూ ఉంటే శరీంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో శరీరం వైరస్, బ్యాక్టీరియాలతో సమర్థంగా పోరాడుతుంది. ఇన్‌ఫెక్షన్‌ల బారినపడే ప్రమాదం తప్పుతుంది.

**మంచి కొలెస్ట్రాల్ పెంపు**

పచ్చి కొబ్బరిని తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దాంతో రక్తంలో ఎలాంటి మలినాలు ఏర్పడవు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

**జీర్ణశక్తికి ఊతం**

పచ్చి కొబ్బరిలో పీచు పదార్థం (ఫైబర్) ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దాంతో జీర్ణ సంబంధ సమస్యలు కూడా త్వరగా రావు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

**మెదడు ఆరోగ్యం**

తరచూ పచ్చి కొబ్బరి తినడం వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. చురుగ్గా పని చేస్తుంది. అల్జీమర్స్ లాంటి తీవ్రమైన మతిమరుపు సమస్యలు రాకుండా ఉంటాయి.

**పిల్లల ఎదుగుదలకు**

ఎదిగే పిల్లలకు పచ్చి కొబ్బరి చాలా మేలు చేస్తుంది. పచ్చి కొబ్బరితో వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దాంతో పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉంటుంది. రక్త హీనత సమస్య తగ్గుతుంది. అలాగే చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు గట్టిపడతాయి.

